సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 28 । జనవరి । 2023



పంచారామంలో ఆమని

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామ క్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దనస్వామి ఆలయాన్ని సినీ నటి ఆమని దర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): జువ్వలపాలెం రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కించారు. 106 రోజులకు రూ.6,68,690 ఆదాయం లభించింది.

నేటి నుంచి అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు



దెందులూరు: గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి.

న్యూస్‌రీల్

అనుమానాల నివృత్తికి పీఎఫ్ సదస్సులు



మాట్లాడుతున్న రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ మనోజ్‌కుమార్

సాక్షి, భీమవరం: ప్రావిడెంట్ ఫండ్‌లోని సభ్యులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, అనుమానాలను నివృత్తికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ మనోజ్ కుమార్ అన్నారు. ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 27న నిధి ఆప్‌కే నికత్ 2.0 పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా నేరుగా వాటాదారులను చేరుకోవడానికి, తద్వారా అన్ని జిల్లాల్లో సేవల సౌలభ్యతను పెంచుతామన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని అందరినీ కలుపుకునే పరిష్కార వేదికగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ యామిజాల దుర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలైనా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రాంతీయ అధికారి పి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేను ఏలూరు అల్లుడిని..

దర్శకుడు గోపీచంద్ మలినేని



మాట్లాడుతున్న దర్శకుడు గోపీచంద్ మలినేని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తాను ఏలూరు అల్లుడినని, తరచూ ఇక్కడకు వస్తుంటానని సినీ దర్శకుడు గోపీచంద్ మలినేని అన్నారు. శుక్రవారం సొంత పనిపై ఏలూరు వచ్చిన ఆయన వీరసింహారెడ్డి చిత్రం ప్రదర్శితమవుతున్న సత్యనారాయణ థియేటర్‌లో ప్రేక్షకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మరో 10, 15 రోజుల్లో తదుపరి చిత్రాన్ని ప్రకటిస్తానని, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్‌తో పాటు తెలుగు చిత్రసీమలోని అందరు హీరోలతో సినిమాలు చేయాలని ఉందన్నారు. ఈ సంక్రాంతి తనకు జీవితంలో గుర్తుండిపోయే పండగ అని, వీరసింహారెడ్డి చిత్రం విశేష ఆదరణ పొందుతోందన్నారు. తన అభిమాన నటుడిని దర్శకత్వం చేసే అవకాశం రావడం ఆ చిత్రానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడం ఆనందంగా ఉందన్నారు. సత్యనారాయణ థియేటర్ ప్రతినిధులు, పంపిణీదారులు పాల్గొన్నారు.


కుష్టు నివారణపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్ట ప్రణాళికను అమలు చేస్తామని, వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని జిల్లా కుష్టునివారణ, టీబీ అధికారి డాక్టర్ రత్నకుమారి తెలిపారు. స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేశ్వరరావుతో కలిసి శుక్రవారం ఆమె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్పర్శ కార్యక్రమాన్ని ఈనెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీవరకూ నిర్వహిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చైతన్యవంతులను చేస్తామన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుంగిన వృక్షం.. రాకపోకలకు అంతరాయం



రహదారిపై విరిగిపడ్డ చెట్టు కొమ్మ

చింతలపూడి: చింతలపూడిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం సమీపంలో ఏలూరు–సత్తుపల్లి రహదారిపై శుక్రవారం భారీ వృక్షం కొమ్మ నేలకొరిగింది. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు చెట్టు కొమ్మను తొలగించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు దర్పణంలా.. మమతానురాగాలకు కోవెలలుగా మండువా లోగిళ్లు నిలుస్తున్నాయి.. వందేళ్లు దాటినా నేటికీ చెక్కుచెదరకుండా ఠీవిగా దర్శనమిస్తున్నాయి.. అలనాటి దర్పాన్ని, హుందాతనాన్ని చాటుతూ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.. ఉభయగోదావరి జిల్లాల్లోని డెల్టా ప్రాంతాల్లో మండువా లోగిళ్లు అత్యధికంగా ఉన్నాయి. పశ్చిమగోదావరితో పాటు కోనసీమ ప్రాంతాల్లో 200కు పైగా కనిపిస్తున్నాయి.

మమతల కోవెలలు.. మండువా లోగిళ్లు



పోడూరులో 1916 నాటి మండువా

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు నియోజకవర్గ పరిధిలోని రేలంగి, సమీప గ్రామాలతోపాటు ఆచంట నియోజకవర్గ పరిధిలోని పెనుమంట్ర, పోడూరు, ఆచంట, పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని యలమంచిలి, భీమవరం నియోజకవర్గ పరిధిలోని వీరవాసరం తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లో మండువా లోగిళ్లు దర్శనమిస్తున్నాయి. నేటికీ అనేక సినిమాలు ఇక్కడి మండువా లోగిళ్లలోనే షూటింగ్‌లు జరుపుకుంటున్నాయి.

నాణ్యతలో మేటిగా..

పూర్వం సంపన్నులు, ఉమ్మడి కుటుంబాల వారు ఎక్కువగా మండువా లోగిళ్లను నిర్మించుకునేవారు. అప్పట్లో 300 గజాల స్థలంలో ఇలాంటి ఇళ్లు నిర్మించడానికి రూ.30 వేలు, వెయ్యి గజాల్లో నిర్మించడానికి రూ.70 వేల వరకు ఖర్చయ్యేదని చెబుతారు. ప్రధానంగా పాటిమట్టి, గానుగ సున్నంతో 3, 4 అడుగుల వెడల్పు గోడలతో ఎంతో విశాలంగా, పటిష్టంగా వీటిని నిర్మించేవారు. వీటికి పెంకులతో కూడిన పైకప్పులు వేసేవారు. ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉండే విశాలమైన హాలునే మండువా అనేవారు. ఆ హాలు చుట్టూ 3 వైపులా ఉమ్మడి కుటుంబాలు ఉండేలా గదులను పోర్షన్లుగా నిర్మించేవారు. ప్రతి పోర్షన్‌కు పైన నాణ్యమైన కలపతో చేసిన మిద్దెలు అత్యంత విశాలంగా ఉంటాయి. ఈ మిద్దెలను స్టోర్ రూమ్‌లుగా వాడేవారు. అలాగే వరదలు, తుపానుల వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు.. బందిపోటు దొంగల భయం ఉన్నపుడు నివసించేందుకు వీలుగా వీటిని ముందుచూపుతో నిర్మించేవారని ఇప్పటి పెద్దలు చెబుతుంటారు.

శతమానంభవంతి

- వందేళ్లు దాటినా చెక్కు చెదరని కట్టడాలు
- గాలి, వెలుతురు వచ్చేలా అందమైన నిర్మాణాలు
- ఉభయగోదావరి జిల్లాల్లో 200కు పైగానే మండువాలు



పోడూరులో 90 ఏళ్ల నాటి మండువా

గాలి, వెలుతురు, చల్లదనం పుష్కలం

ఈ ఇళ్లల్లో గాలి, వెలుతురు పుష్కలంగా ఉండేలా కిటికీలు ఎక్కువగా పెట్టేవారు. అలాగే మండువా హాలులో పైకప్పును నాలుగైదు అడుగుల మేర చతురస్రాకారంలో ఖాళీగా ఉంచేవారు. ఇంటికి ఉండే కిటికీల నుంచే కాకుండా ఈ ఖాళీ ప్రదేశం నుంచి సూర్యరశ్మి, గాలి, వెలుతురు పుష్కలంగా వస్తుంది. ఇక్కడ నుంచి వర్షం నీరు నేరుగా కింద పడుతుంది.



మండువా లోగిలి

కొంతమంది వర్షం నీరు బయటకు వెళ్లేలా పైపును అమర్చేవారు. అవసరాన్ని బట్టి కొన్ని ఇళ్లను రెండు మండువాలతో నిర్మించేవారు. పూర్వం నిర్మించిన ఈ మండువా లోగిళ్లకు ఎక్కువగా బర్మా టేకు, బర్మా మద్ది (నల్లమద్ది)ని వినియోగించేవారు. ప్రధాన ద్వారాలు భారీగా ఉండటంతోపాటు ప్రధాన ద్వారంపై, నిలువు స్తంభాలపై ఎంతో అందమైన, ఆకర్షణీయమైన కళాత్మక రూపాలు చెక్కించేవారు. ఈ మండువా లోగిళ్లకు ఇవే ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. పెంకుటి పైకప్పుతో ఉండడం వల్ల వేసవి కాలంలో కూడా ఈ ఇళ్లు చల్లదనంతో ఉంటాయి.

నిర్వహణ ఖర్చు అధికమే..

ప్రస్తుతం మండువా ఇళ్లను పరిరక్షించడం భారీ ఖర్చుతో కూడుకున్నప్పటికీ 5, 6 తరాలకు చిహ్నాలుగా ఉన్న ఇళ్లను కుటుంబీకులు పరిరక్షించుకుంటున్నారు. ప్రధానంగా కలప చెద పట్టకుండా నాలుగు లేదా ఐదేళ్లకు ఒకసారి స్ప్రే చేయించడం, కిటికీలు, తలుపులు, మిద్దె పైకప్పులను తరుచూ శుభ్రం చేయించడం, నాలుగేళ్లకు ఒకసారి పెంకులను అవసరమైన మేరకు మార్చడం చేస్తున్నారు.

మాది ఏడో తరం



ఈ ఇల్లు దాదాపు 125 ఏళ్ల క్రితం నిర్మించారు. మాది 7వ తరం. ఇప్పటికీ మా ఇల్లు పటిష్టంగానే ఉంది. చిన్న, చిన్న మరమ్మతులు చేయించాం. నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉంటున్నా పూర్వీకులు ఇచ్చిన ఇల్లు కావడంతో పాడవకుండా రక్షించుకుంటున్నాం

– చేకూరి సుబ్బరాజు, పోడూరు

120 ఏళ్ల క్రితం ఇల్లు మాది



మా ఇల్లు నిర్మించి సుమారు 120 ఏళ్లవుతోంది. మా మనవలతో లెక్కేస్తే 8వ తరం ఇంట్లో ఉంటున్నట్లు. ఇంకో 50 ఏళ్లయినా అలాగే ఉంటుంది. పెంకుటిల్లు కావడంతో ముఖ్యంగా పెంకు నిలబడే రిఫర్ దెబ్బతినకుండా చూసుకోవాలి. 3, 4 ఏళ్లకు ఒకసారి అవసరమైన మరమ్మతులు చేయిస్తాం.

– ఆర్ఎస్ రాజు, పోడూరు

● గడపగడపన.. జన దీవెన



పెనుగొండ : ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



భీమవరం అర్బన్ : దేగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

పశువుల కట్టడికి చర్యలు

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో రోడ్లపైకి వచ్చే పశువులను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని, పశువుల యజమానులకు అపరాధ రుసుం విధించాలని కలెక్టర్ పి.ప్రశాంతి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ రహదారులపైకి వచ్చే పశువులకు ఒకటి, రెండు సార్లు స్టాంపు వేసి, మొదటిసారి వచ్చిన వాటికి రూ.2 వేలు, రెండో సారి వేస్తే రూ.5 వేలు అపరాధ రుసుం విధించాలని, మూడోసారి వస్తే పశు యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కబేలాల నిర్వహణపై.. పందుల పెంపకందారుల యూనియన్ సభ్యులతో మాట్లాడి పందులను ఆవాసాలకు దూరంగా పెంచుకునేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జనావాసాల్లోకి పందులను వదిలితే యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కబేలాల నిర్వహణ, పశు వధ సమయంలో వైద్యులు పరిశీలిస్తున్నారా లేదా అనే విషయాలపై నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రతి మున్సిపాలిటీలో ఎస్టీపీలను ఏర్పాటుచేయాలని, ప్రతి స్లాటర్ హౌస్‌లో విధిగా శానిటేషన్ పాటించాలని, వ్యర్థాలను నేరుగా మురుగు కాలువలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పశువులన్నింటికీ చికిత్స అందించాలన్నారు. శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలన్నారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, డీపీఓ ఎం.నాగలత, పశుసంవర్ధక శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించం

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరిక

ముసునూరు: విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించేది లేదని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. ముసునూరు బీసీ బాలుర హాస్టల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల వద్దకు వెళ్లి వసతులపై ఆరా తీశారు. సీఎం జగన్ రూ.30 వేల విలువైన ట్యాబ్‌లు ఇచ్చారు కదా వాటితో ఏంచేస్తున్నారంటూ విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయకపోతే ఊరుకోబోమన్నారు. విద్యార్థుల్లో ప్రగతిని సాధించకపోతే ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈఓ మధుసూదనరావును ఆదేశించారు. తక్షణమే ప్రక్షాళన చర్యలు చేపట్టాలన్నారు. సర్వశిక్షా అభియాన్ పీడీ శ్యామ్ సుందర్, డీవైఈఓ సేవియా నాయక్ ఉన్నారు.

భీమవరంతో జమునకు అనుబంధం



మావుళ్లమ్మ ఉత్సవాల్లో సినీ నటి జమునను సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): సినీ నటి జమునకు భీమవరంతో ప్రత్యేక అనుబంధం ఉంది. 2016లో జరిగిన మావుళ్లమ్మవారి ఆలయ 52వ వార్షికోత్సవంలో జమునను నీరుల్లి, కూరగాయ, పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు సువర్ణ కంఠాభరణంతో ఘనంగా సత్కరించారు. అభినవ సత్యభామగా పేరొందిన జమున మృతి తీరని లోటని కమిటీ సభ్యులు సంతాపం తెలిపారు.

వృత్తిదారులకు 'చేదోడు'వాదోడుగా..

భీమవరం(ప్రకాశం చౌక్): చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల చొప్పున వైఎస్సార్ చేదోడు పథకం కింద అందిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే రెండు విడతల సాయం అందించగా మూడో విడత లబ్ధిని ఈనెల 30న అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు లబ్ధిదారులతో దరఖాస్తు చేయించడంతో పాటు ఈకేవైసీ ప్రక్రియను సచివాలయ సిబ్బంది పూర్తిచేశారు. జిల్లాలో గతేడాది కంటే ఈసారి లబ్ధిదారుల సంఖ్య పెరిగింది.

అదనంగా 1,563 మందికి..

వైఎస్సార్ చేదోడు పథకానికి సంబంధించి ఈ ఏడాది మూడో విడత సాయం కింద 10,468 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో రెండో విడత లబ్ధిదారులు 8,905 మంది ఉండగా కొత్తగా 1,563 మందికి లబ్ధి అందించనున్నారు. వీరికి మొత్తంగా రూ.10 కోట్ల 46 లక్షల 80 వేల సాయం అందించనున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో 16,705 మందికి పథకం కింద రూ.16 కోట్ల 70 లక్షల 50 వేల సాయం అందింది. మొదటి విడతతో పోలిస్తే లబ్ధిదారుల సంఖ్య 2,668 పెరిగింది.

సద్వినియోగం చేసుకుని..

ప్రభుత్వం ఏటా ఇచ్చే రూ.10 వేలను రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. వారి వృత్తికి సంబంధించిన వస్తువుల కొనుగోలు, షాపు అద్దెలు, విద్యుత్ బిల్లులకు ఉపయోగించుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందించడంపై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్ చేదోడుతో పాటు తమ కుటుంబాలకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత, ఆసరా, రైతు భరోసా వంటి పథకాలు కూడా అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందం పదింతలు

- ఏటా రూ.10 వేల సాయం
- ఈనెల 30న మూడో విడత అందజేత
- నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు లబ్ధి
- 10,468 మందికి రూ.10.46 కోట్ల జమ

వైఎస్సార్ చేదోడు ఇలా..

విడత	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి	7,800	7.80
రెండో	8,905	8.90
మూడో	10,468	10.46



సెలూన్ షాపులో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు

చాలా సంతోషం



వైఎస్సార్ చేదోడు పథకం ద్వారా నేను రెండు విడతల్లో ఇప్పటికే రూ.20 వేలు అందుకున్నాను. మూడో విడత సాయం కోసం అవసరమైన పత్రాలను సచివాలయ సిబ్బందికి అందజేసి ఈకేవైసీ కూడా పూర్తి చేశాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం చేయడం చాలా సంతోషంగా ఉంది.

– తాతపూడి గణేష్, చేదోడు లబ్ధిదారుడు, నౌవూదూరు

10,468 మందికి..



వైఎస్సార్ చేదోడు పథకం మూడో విడత కింద జిల్లాలో 10,468 మంది లబ్ధిదారులకు రూ.10 వేల చొప్పున అందించనున్నాం. ఈసారి కొత్తగా 1,563 మంది లబ్ధిదారులు అర్హత సాధించారు. రజక, టైలర్లు, నాయీబ్రాహ్మణులకు మూడో విడత సాయాన్ని ఈనెల 30వ తేదీ నుంచి వారి ఖాతాల్లో జమచేస్తాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్

క్లుప్తంగా

ఆకట్టుకున్న శ్రీరామాంజనేయ యుద్ధం

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం సాయంత్రం రాధాకృష్ణ కళాక్షేత్రం ధవళేశ్వరం వారిచే కూచిపూడి, జానపద నృత్యాలు, రాత్రి 7 గంటలకు సర్వసుధ ఆర్కెస్ట్రా భీమవరం వారిచే సినీ మ్యూజికల్ నైట్ రాత్రి 8 గంటలకు శ్రీబాల సరస్వతి నాట్యమండలి సంపత్‌నగర్ వారిచే శ్రీరామాంజనేయ నాటకం ప్రేక్షకులను అలరించింది. పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఈ ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవాల్లో శనివారం సాయంత్రం 5 గంటలకు కూచిపూడి నృత్యం 6 గంటలకు కూచిపూడి నృత్యం, రాత్రి 8 గంటలకు సినీ ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

యూత్ పార్లమెంట్ పోటీలకు నలుగురి ఎంపిక

ఏలూరు రూరల్: జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ 2023 పోటీలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూత్ అధికారి దూలం కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పోటీల్లో ఏలూరు జిల్లా నుంచి కూన పద్మజాహ్నవి, మద్దుకూరి శ్రీరామ్ పశ్చిమగోదావరి జిల్లా నుంచి అడపా కృష్ణసాయి వర్షిత, బీవీఎస్ శ్వేత ఎన్నికయ్యారని వెల్లడించారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

మావుళ్లమ్మ ఉత్సవాలు కళకళ



మావుళ్లమ్మ ఉత్సవాల్లో అల్లూరి సీతారామరాజు నాటకం(ఫైల్)



కూచిపూడి నృత్యాలు

- నాటకాలు, హరికథ, బుర్రకథలకు పెద్దపీట
- ఏటా 30 రోజుల పాటు నాటకాలు

భీమవరం(ప్రకాశం చౌక్): అమ్మవారి జాతర్లు, ఉత్సవాల్లో వినోద కార్యక్రమాలకు అగ్రతాంబూలం ఉంటుంది. అయితే సినీ ఆర్కెస్ట్రాలు, డాన్స్ కార్యక్రమాల వైపు నిర్వాహకులు ఎక్కువగా మొగ్గుచూపుతుంటారు. అయితే మావుళ్లమ్మ ఉత్సవాల్లో మాత్రం నాటకాలు, హరికథ, బుర్రకథ, కూచిపూడి నృత్యాలు, జానపద నృత్యాలకు పెద్ద పీట వేసి కళలను ఆదరిస్తున్నారు. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏటా అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారి 59 వార్షిక మహోత్సవాలు ఈ నెల 13 నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది సైతం నాటకాలు, హరికథ, బుర్రకథ, కూచిపూడి నృత్యాలకు ప్రాధాన్యతనిచ్చారు.



హరికథ

నెల రోజులపాటు నాటకాలు

అమ్మవారి ఉత్సవాలను సుమారు నెల రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో నాటకాలు, హరికథలు, బుర్రకథలు, జానపద నృత్యాలు ఏర్పాటు చేస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి కళాకారులను తీసుకువస్తారు. జానపద, విప్లవ, భక్తి, సందేశాత్మక నాటకాలను ఇక్కడ పదర్శిస్తారు. నృత్య కళాకారులను తీసుకొచ్చి కూచిపూడి, భరత్యనాట్యం, జానపద నృత్య కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. ఏటా సాంస్కృతిక కార్యక్రమాలకు సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు. శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఉత్సవాల్లో ఏర్పాటు చేసే నాటకాలు, హరికథ, బుర్రకథలను తిలకించడానికి భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

నిర్వాహకుల ప్రయత్నం ప్రశంసనీయం



నాటకాలను ఏటా ప్రోత్సహిస్తున్న ఘనత మావుళ్లమ్మ అమ్మవారి ఉత్సవాల నిర్వాహకులైన నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీకే దక్కుతుంది. అమ్మవారి ఉత్సవాల్లో నెల రోజుల పాటు ప్రతి రోజు నాటకం ఉండేలా అనేక నాటక పరిషత్‌లను తీసుకువచ్చి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. నాటకాలకు ఆదరణ కరువవుతున్నా.. ఇక్కడ ఏటా నాటకాలు ఉండేలా నిర్వాహకులు ఏర్పాటు చేయడం చాలా సంతోషం

భూసాల రామారావు, బెండపూడి, నాటక కళాకారుడు

8 ఏళ్లుగా హరికథా గానం



నేను గత 8 ఏళ్లుగా అమ్మవారి ఉత్సవాలకు వచ్చి హరికథా గానం చేస్తున్నాను. ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాల్లో హరికథా గానం చేశాను. నేటితరం వారికి సంప్రదాయమైన హరికథ, బుర్రకథల గురించి తెలిసేలా చేస్తున్నారు.

కాశ్శ నిర్మల, హరికథ కళాకారిణి, విజయనగరం

కళాకారులకు ఉపాధి, ప్రోత్సాహం



శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఉత్సవాల నిర్వాహకులు ఏటా నాటక కళాకారులను ప్రోత్సహించి ఉపాధి కల్పిస్తున్నారు. భీమవరం వచ్చి అమ్మవారి కళావేదికపై నటించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఎంతో మంది కళాకారులను ఆదరిస్తున్నారు.

గోవర్ధన యదవ్, కళాకారుడు గుంటూరు

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

చింతలపూడి: వివాహేతర సంబంధం ఒక మహిళ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కంచనగూడెం శివారులోని అటవీ ప్రాంతంలో ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలు టి.నరసాపురం మండలం, బంధంచర్ల గ్రామానికి చెందిన కంచర్ల సునీత(39)గా గుర్తించారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం సునీతకు 20 ఏళ్ల క్రితం చాత్రాయి మండలానికి చెందిన కంచర్ల మాణిక్యాలరావుతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నేళ్ల క్రితం మాణిక్యాలరావు మృతి చెందాడు. సునీత బంధంచర్లకు చెందిన సువర్ణరాజుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇటీవల విభేదాలు రావడంతో తనతో సరిగా మాట్లాడటం లేదని మృతురాలిపై సువర్ణరాజు కోపంపెంచుకున్నాడు. ఈ నెల 20న ఇద్దరూ కంచనగూడెం సమీపంలోని అడవిలో కలుసుకున్నారు. అక్కడ ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో సువర్ణ రాజు క్షణికావేశంలో సునీత గొంతు నులిమి హత్య చేసినట్లు తెలిపారు. సునీత కనిపించడంలేదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భయపడ్డ నిందితుడు పోలీసులకు లొంగిపోవడంతో అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

28 నుంచి వంతుల వారీగా సాగునీరు

ఉండి: రబీ పంట సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి నీటిపారుదల అధికారులు వంతులవారీ విధానానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డీఈఈ పీఎన్‌వీవీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. ఈ నెల 28 నుంచి ఉండి కాలువకు, ఫిబ్రవరి 3 నుంచి వెంకయ్య వయ్యేరు పంట కాలువకు సాగునీటిని వంతులవారీ విధానంలో సరఫరా చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. శివారు ప్రాంతాల రైతులతో సహా అందరు గమనించి నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు. ఉండి పంట కాలువ ఆయకట్టు పరిధిలో 41,151 ఎకరాలు, వెంకయ్య వయ్యేరు పంటకాలువ పరిధిలో 33,962 ఎకరాలు సాగులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఉండి కాలువ పరిధిలో ఉండి మండలంలోని 19 గ్రామాలు, గణపవరం మండలంలోని 18 గ్రామాలు, కాళ్ళ మండలంలోని 10 గ్రామాలు, భీమవరం మండలంలోని 10 గ్రామాల రైతులు ఉన్నారని చెప్పారు. వెంకయ్య వయ్యేరు పరిధిలో పెంటపాడు మండలంలోని 7 గ్రామాలు, గణపవరం మండలంలో ఒక గ్రామం, నిడమర్రు మండలంలో 8 గ్రామాలు, ఆకివీడు మండలంలోని అన్ని గ్రామాలు, కాళ్ళ మండలంలోని 4 గ్రామాల రైతులు ఉన్నట్లు తెలిపారు.



ఉండి పంట కాలువ

ఉండి కాలువకు

- ఈ నెల 28న ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ ఉదయం 6 గం. వరకు
- ఫిబ్రవరి 10న ఉదయం 6 గం. నుంచి 16వ తేదీ ఉదయం 6 గం. వరకు
- 23న ఉదయం 6 గంటల నుంచి మార్చి 1న ఉదయం 6 గం వరకు
- మార్చి 8న ఉదయం 6 గంటల నుంచి 14వ తేదీ ఉదయం 6 గంటల వరకు
- 21న ఉదయం 6 గంటల నుంచి 27న ఉదయం 6 గంటల వరకు

వెంకయ్య వయ్యేరు కాలువ పరిధిలో..

- ఈ నెల 3న సాయంత్రం 6 గంటల నుంచి 9న సాయంత్రం 6 గం. వరకు
- 16న సాయంత్రం 6 గంటల నుంచి 22న సాయంత్రం 6 గంటల వరకు
- మార్చి 1న సాయంత్రం 6 గంటల నుంచి 7న సాయంత్రం 6 గంటల వరకు
- 14వ తేదీ సాయంత్రం 6 గం. నుంచి 20వ తేదీ సాయంత్రం 6 గం. వరకు
- మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 సాయంత్రం 6 గం.వరకు వంతుల వారీ విధానంలో నీటి విడుదల జరుగుతుందని తెలిపారు.

11న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 11న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. పోణంగిలో చట్టాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన గ్రామస్తులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులను రాజీ చేస్తారని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను అర్హులైన అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ప్రత్తిపాటి తంబి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసగించిన యువకుడి అరెస్టు

పాలకోడేరు: పెళ్ళి చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేశాడంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యక్తిని అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ నాగప్రసాద్ తెలిపారు. శృంగవృక్షం చినపేటకు చెందిన మహిళ భర్త నుంచి విడిపోయి ఇద్దరి పిల్లలతో జీవిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన పోతుల సందీప్ తనకు పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసగించాడని ఆమె ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సందీప్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఆకివీడు నగర పంచాయితీ

ఆర్.ఓ.సి.నెం.58/2023/ఎ1 తేది: 20.01.2023

ఆకివీడు నగర పంచాయితీ స్వచ్ఛ సర్వేక్షణ్, 2023 పోటీలలో మెరుగైన ర్యాంకు సాధన కోసం ఆకివీడు పట్టణాన్ని ODF+, ODF++ గా తీర్చిదిద్దుటకు మరియు చెత్త రహిత పట్టణాలలో 3 స్టార్ రేటింగ్ ఆఫ్ గార్బేజ్ ఫ్రీ సిటీగా ఉంచుటకు క్రింది చర్యలు చేపట్టడమైనది.

1) పట్టణాన్ని పూర్తి స్థాయిలో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణముగా ఉంచుట.

2) పట్టణ ప్రజలు పూర్తిస్థాయిలో తడి చెత్త, పొడి చెత్తలను నివాసాల వద్దనే అందజేయుట.

సదరు విషయమై అభ్యంతరములు ఉన్నచో తెలియజేయవలసినదిగా ప్రజలకు విజ్ఞప్తి చేయడమైనది.

కమీషనర్, ఆకివీడు నగర పంచాయితీ

డ్రోన్ల వాడకంతో రైతులకు లాభం



మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు చూపిస్తున్న శాస్త్రవేత్తలు

పెనుమంట్ర: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.భరత్‌లక్ష్మి అన్నారు. శుక్రవారం మార్టేరు పరిశోధన స్థానంలో రైతులకు డ్రోన్‌ల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భరత్‌లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కూలీల కొరత, కూలీల రేట్లను అధిగమించేందుకు సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు డ్రోన్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. నేటి పరిస్థితుల్లో రైతులు యాంత్రీకరణపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం పుష్పక్ పేరుతో డ్రోన్‌లను రూపొందించిందని చెప్పారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రోన్లను కేవలం పురుగు మందుల పిచికారీకే కాకుండా ఎరువులు, విత్తనాలు వేయడానికి కూడా మార్పులు చేర్పులు చేస్తున్నారన్నారు. సీనియర్ శాస్త్రవేత్త ఎం.రామభద్రరాజు వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం అనే అంశంపై పవర్‌పాయింట్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. 10 లీటర్ల సామర్థ్యం గల ఒక డ్రోన్‌తో 6 నుంచి 10 నిమిషాల వ్యవధిలో ఎకరా పొలంలో పిచికారీ చేయవచ్చన్నారు. దీని వలన మందుల వినియోగాన్ని 25 శాతం తగ్గించుకోవచ్చన్నారు. విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ కృష్ణాజీ సమన్వయ కర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆక్వా రైతు సంక్షేమమే ధ్యేయం



వాండ్రంలో ఆక్వా రైతుకు ప్రొటీన్ మేతను అందిస్తున్న రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, అప్సడా వైస్ చైర్మన్ రఘురాం తదితరులు

ఉండి: ఆక్వా రైతుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. ఉండి మండలం వాండ్రంలోని ఆక్వా రైతుల సంక్షేమ అసోసియేషన్ భవనంలో శుక్రవారం రైతులు, సీడ్, ఫీడ్ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీ మస్తాన్‌రావు, అప్సడా వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వారంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, వ్యాపారులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో కూడా వాండ్రంలో సమావేశం నిర్వహించి రైతులు, వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నామని అన్నారు. వాటి పరిష్కార కార్యక్రమంలో భాగంగానే ఆక్వారైతులు విరివిగా ఉపయోగించే న్యూటిషన్ మేతను మార్కెట్ ధరకంటే తక్కువగా కిలో రూ.69 కే బీఎంఆర్ సంస్థ అందజేస్తున్నట్లు తెలిపారు. ఆక్వా రైతులకు సరైన ధర లభించేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడా మధ్యవర్తులు, దళారులు రైతులను మోసం చేయకుండా ధరలు ఎప్పటికప్పుడు మార్చే అవకాశం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రొటీన్ మేతను అందించేందుకు ఎంపీ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని రఘురాం అన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

రొయ్యల చెరువు అమ్మబడును.

■ నిడమర్రు మండలం, పెదనిండ్రకొలను గ్రామంలో, అన్ని వసతులు వున్న 13.5 ఎకరాల రొయ్యల చెరువు అమ్మకం. సంప్ర: 99899 99599 [P-1169145]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2284]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786667]

BUSINESS OFFER

■ Looking To Buy / Lease a Running School. We also support to upgrade infrastructure & faculty based on need. Call : 7036005566 [HA-28290]

■ We Release your pledged gold బంగారం బ్యాంక్సులో ప్రైవేట్ సంస్థల్లో తనఖాలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతో, తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-5549]

MARRIAGE BUREAU

■ 20 సం॥లుగా ఎన్నో వందల వివాహ సంబంధములు కుదిర్చిన రాష్ట్రంలో అగ్రగామి సంస్థ. వధూవరుల వివాహ సంబంధాలకై సంప్ర॥ శ్రీచౌదరి, RJY. ✆ : 89775 36399 [R-887]

CONSULTANCY

■ US Based Company Seeking IT- Engineer's for US Project's H1B Sponsership available for qualified candidates for 2023 H1B quota. 9959925789, 9440113345. [HA-1498]

Wanted

■ హరేకృష్ణ హోంజేర్ విజయవాడలో వృద్ధులను / పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు (M/F) కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 16,000/- ✆ 96405 28899, 96406 48899 [B-815]

■ ఏలూరు స్థానిక బుద్ధ పార్కు వద్ద మా సంస్థ నందు జాబ్ చేయుటకు లేడి క్యాషియర్ కావలెను. పనివేళలు: 4 AM to 11 AM అనుభవం గలవారు మాత్రమే. ✆ 8008133316 [G-1054]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779862]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190556]


■ Wanted Field Executives to work in Banking sector. Good Salary + Incentive + Petrol Allowance. Contact time : 10 am to 6 pm. Ph : 79013 33864 [V-775084]

■ పంజాగుట్టలో (HYD) పనిచేయుటకు డ్రైవర్స్, సూపర్వైజర్స్, బాయ్స్, & కిచెన్ లో పనిచేయుటకు నార్త్ ఇండియన్ వంట మాస్టర్స్ కావలెను, జీతం + వసతి+ భోజనం కలదు. ఫోన్ : 9949633117, 9848470329 [H-793302]

■ పంజాగుట్టలోని హాస్టల్‌లో పనిచేయుటకు వంట మాస్టర్ (ఫ్యామిలీ) 10 సం॥ ఆపై అనుభవం గల వారు కావలెను. (మంచి జీతం + వసతి) ఫోన్ : 9949633117. [H-793307]

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ J.Group కంపెనీ హైదరాబాద్‌లో పని చేయుటకు ఉత్సాహవంతమైన యవకులు కావలెను. సాలరీ: 14,000 to 40,000/- + కమీషన్. Quail: 10th, ఇంటర్, డిగ్రీ. ఫోన్: 9666688883. [HA-716]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు: 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-787431]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





క్లుప్తంగా

బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు


బలుసులమ్మవారికి కేజీ వెండి సమర్పించిన దాతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. వసంత పంచమి సందర్భంగా అమ్మవారికి సరస్వతి దేవిగా విశేష అలంకరణ గావించారు. దాతలు పెద్దపురం వాస్తవ్యులు తాళ్లూరి శక్తి రవి తేజా, బేబి రత్న మేఘన, తన్విక్, తరుణిలు అమ్మవారికి 1 కేజీ వెండి సమర్పించారు. శుక్రవారం కావడంతో భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కొత్త ఆవిష్కరణలను చేపట్టి నూతన అధ్యాయానికి నాంది పలకాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణలు చేపట్టి నూతన అధ్యాయానికి నాంది పలకాలని ఏపీ నిట్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డా.జీ.బీ వీరేష్ కుమార్ సూచించారు. గూడెం నిట్‌లో శుక్రవారం కర్టెన్ రైజర్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ నిట్ ప్రాంగణంలో ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో ఉల్కాన్ జీ టెక్నో కల్చరల్ ఫెస్టివల్ 2023 (సాంకేతిక, సాంస్కృతిక) ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే నూతన సాంకేతికను అందిపుచ్చుకోవడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డా.వి.సందీప్, డా. కృష్ణమూర్తి, డా.రాజేశ్వర్ రెడ్డి, డా.సంతోష్‌కుమార్, డా.తలారి రేష్మా, డా.సుదర్శన్ దీప, డా. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

ఇరగవరం: మండలంలోని ఇరగవరం తహసీల్దార్ కార్యాలయంలో, పశువుల ఆసుపత్రిలో అధికారులు, ప్రజల సౌకర్యార్థం కుర్చీలు అందించడం జరిగిందని, జెడ్పీటీసీ పంపన అంజిబాబు అన్నారు. ప్రతి రోజు అనేక మంది ప్రజలు ప్రభుత్వ కార్యాలయలకు అనేక పనుల మీద వస్తుంటారు. వారికి కుర్చోవడానికి సరైన కుర్చీలు ఉండటం లేదు. అందుకే పది కుర్చీలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పశువుల ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

అత్తిలి: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ తహసీల్దార్‌గా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అత్తిలి తహసీల్దార్ ఏవీ రామాంజనేయులను గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం తరపున సన్మానించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులకు శాలువాకప్పి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం డివిజన్ అధ్యక్షుడు బీవీఏవీ పండు, మండల అధ్యక్షుడు లంకపల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాపాక ఏసురత్నం, కార్యదర్శి తానుకొండ జాన్‌మోషే, కోశాధికారి టి లక్ష్మి, వీఆర్ఏలు అడపా బుల్లబ్బాయి, కె నారాయణరావు, ఇంటి దుర్గ, వేడంగి సీనయ్య, దిగమర్తి కృష్ణమూర్తి, మేక రాఘవులు, మెరిపే బాలస్వామి, సూర్యనారాయణ, కుటుంబరావు, దానయ్య, దామిశెట్టి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేత

పెంటపాడు: విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతులు కావాలని రావిపాడు సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణలు కోరారు. రావిపాడు గ్రామంలో కోటగిరి అప్పారాయ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో రూ. 20 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, సొసైటీ త్రిసభ్యకమిటీ సభ్యులు వింజమూరి శ్రీనివాస్, దాట్ల రామలింగరాజు, కార్యదర్శి మాదాసు రాంబాబు, పెన్నాడ రాఘవులులతో పాటు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ (ఎంవీఐ) డీఎస్ఎస్ నాయక్ తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపోలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రారంభించారు. డ్రైవర్లు, గ్యారేజీ మెకానిక్‌లకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య, సూపర్‌వైజర్లు చిట్టిబాబు, సురేష్, భీమయ్య, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనది

తణుకు అర్బన్: డ్రైవర్ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైందని తణుకు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తణుకు డిపో గ్యారేజ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ 2 బీవీకే రావు, సూపరింటెండెంట్ రమణమూర్తి, గ్యారేజ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడ్జెట్ అజెండా బట్వాడాపై వాగ్వాదం


బడ్జెట్ సమావేశంలో సర్పంచ్‌లకు బదులు భర్తలు సమావేశంలో ప్రజాప్రతినిధులతో వాగ్వాదానికి దిగిన దృశ్యం


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు

- రెండురోజుల ముందు మాత్రమే అజెండా
- జగన్నాథపురం సర్పంచ్ ఆవేదన
- ఇకపై అజెండా ముందుగానే అందజేస్తామంటూ సర్దిచెప్పిన తహసీల్దార్

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సవరణ బడ్జెట్, అంచనా బడ్జెట్‌పై జరిగిన సమావేశ అజెండా అందడంలో ఆలస్యమైందంటూ జగన్నాథపురం సర్పంచ్ పానుకుమాటి గౌరీ ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజులు క్రితమే అజెండా అందిందని పేర్కొన్నారు. దీనిపై దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు, ఆరుగొలను సర్పంచ్ పీతల బుచ్చిబాబులు జోక్యం చేసుకుని తనకు ఐదు రోజుల క్రితమే అందిందని సమాధానం ఇచ్చారు. జగన్నాథపురం ఓట్ల లెక్కింపు విషయాన్ని సర్పంచ్ గౌరి ప్రస్తావిస్తుండటంతో కోర్టులో ఉన్న విషయాన్ని ఇక్కడ ప్రస్తావించరాదని, ప్రజాసమస్యలపై మాట్లాడాలని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పానుకుమాటి శేషులత అధ్యక్షతన 2022–23 సవరణ బడ్జెట్, 2023–24 సాధారణ బడ్జెట్ అంచనాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో సర్పంచ్ గౌరీ పైకి లేచి పోడియం వద్దకు చేరుకుని మైక్ తీసుకుని సమావేశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. ఆమెతో పాటు ఆమె భర్త సైతం సమావేశంలో అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీయడంతో సమావేశం రసాభాసగా మారింది. సమావేశంతో సంబంధం లేని వ్యక్తులు ప్రవేశించి మాట్లాడటమే కాకుండా వీడియోలు తీయడంపై జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై కొంతసేపు వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు కలుగజేసుకుని సభ్యులు కాని వారు సమావేశంలోకి ప్రవేశించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఇకపై ఇటువంటి పొరపాటు జరగకుండా ముందుగానే సమావేశపు అజెండా అందేలా చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పారు. దీంతో సర్పంచ్ గౌరి శాంతించారు. అనంతరం జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లకు సంబంధించి రూ.100 కోట్లతో ప్రతిపాదనలను డీప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రభుత్వానికి పంపించారన్నారు. నిధులు రాగానే పనులు చేపడతామన్నారు. గ్రామాల్లో చిన్నపాటి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, ఆ తదుపరే ఎన్నికలకు వెళ్తామన్నారు. వ్యవసాయ శాఖ అంశంపై ఏవో ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ రైతులంతా తప్పనిసరిగా ఈ–కేవైసీ, ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఆర్బీకేల వద్ద ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. సబ్సిడీతో కూడిన యంత్రాలకు సంబంధించి ఆర్బీకేలను గాని, తమను గాని సంప్రదించాలన్నారు. ఆరుగొలను, కొత్తూరులో గ్రామ వ్యవసాయ సహాయకులు లేకపోవడంతో అక్కడ ఈ–క్రాప్ చేయడం ఆలస్యమవుతుందని, వెంటనే ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు పీతల బుచ్చిబాబు, కూడవల్లి హనుమంతు వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ధాన్యం, రవాణాకు సంబంధించి సొమ్ములు జమ అవుతున్నాయన్నారు. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు మాట్లాడుతూ గత కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రీ–సర్వే ద్వారా పరిష్కారమవుతుందన్నారు. అలాగే, ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్, విద్య, మంచినీరు, ఎన్ఆర్ఈజీసీ, హెల్త్, పంచాయతీ రాజ్ తదితర శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.వెంకటేష్, వెలుగు ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.విశాలాక్షి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, పీఆర్ ఏఈ జి.పవన్‌కుమార్, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉద్యాన యూనివర్సిటీలో ఘనంగా చామంతి సంబరాలు


చామంతి సంబరాలు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఉపకులపతి డా.టి.జానకిరామ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ వెంకట్రామన్నగూడెంలో ఉద్యాన కళాశాల పువ్వుల క్షేత్రంలో చామంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ప్రకాశరావుపాలెం, పడాల, తెలికచెర్ల గ్రామాల నుంచి రైతులు, మహిళలు హాజరైయారు. ముఖ్య అతిథిగా ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డా.టి.జానకిరామ్ హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన సంబరాలను ప్రారంభించారు. జానకిరామ్ మాట్లాడుతూ చామంతి అద్భుతమైన పువ్వని, అందానికి, ఆహారానికి, ఆహార పానీయానికి ఉపయోగపడే విశిష్ట పువ్వు చామంతి అన్నారు. శీతాకాలంలో మాత్రమే ఎక్కువగా పండే వాణిజ్యపంటగా పేరొందన్నారు. అభివృద్ధి చేసిన యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని, సంవత్సరం పొడవునా పంట పండించడం, దిగుబడి పొందడం చేయవచ్చున్నారు. పూల సాగులో ఏపీకి విశిష్ట స్థానం ఉందని, వెయ్యికిపైగా నర్సరీలు కడియంలో ఉన్నాయని, వర్సిటీ ద్వారా రైతులకు ఆదాయం రెట్టింపు చేయగల శక్తి ఉందని వెల్లడించారు. సంబరాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డా.ఎ.ఎస్.పద్మావతమ్మ, డా.ఎల్.నారం నాయుడు, పరిశోధనా సంచాలకులు డా.ఈ.కరుణశ్రీ, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ కార్మికులను ఆదుకోవాలి

తణుకు అర్బన్: అమెరికాకు చెందిన థామస్ ఆల్వా ఎడిసన్ బల్బును కనుగొన్న జనవరి 27 పురస్కరించుకొని శుక్రవారం ఎలక్ట్రికల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముదిగిన సత్యనారాయణ మాట్లాడుతూ 1880లో అమెరికాకు చెందిన థామస్ ఆల్వా ఎడిసన్ బల్బును కనుగొని పేటెంట్ పొందారని అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని ఎలక్ట్రిక్ పరికరాలు అభివృద్ధి చెంది ప్రపంచానికి వెలుగునిస్తున్నాయని అన్నారు. ఎలక్ట్రికల్ వర్కర్లు అందరికీ రక్షణ కోసం ప్రభుత్వాలు బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. కార్మికులు ప్రమాదంలో చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కేతా విజయకుమార్, బళ్ల నాని, ఉపాధ్యక్షులు ఉన్నమట్ల రామారావు, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శి కాజులూరి పోతురాజు, కోశాధికారి ఉన్నమట్ల జాన్, సభ్యులు పాల్గొన్నారు.


తణుకులో తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

థామస్ ఆల్వా ఎడిసన్ విగ్రహావిష్కరణ

అత్తిలి:ఎలక్ట్రిషియన్ డే సందర్భంగా అత్తిలి ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరెంటు బల్బు సృష్టికర్త థామస్ ఆల్వా ఎడిషన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అత్తిలి ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సంఘ భవనంలో శుక్రవారం జెండా వందనం చేసి, అనంతరం ర్యాలీ చేసారు. సంఘ గౌరవ అధ్యక్షుడు సైపు సూర్యచంద్రరావు ఎడిషన్ విగ్రహాన్ని ఆవిష్కరించగా, సంఘ అధ్యక్షుడు బడేటి సర్వేశ్వరరావు జెండా వందనం చేసారు. ఈసందర్భంగా కడలి రాంబాబు మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిషన్ బల్బును కనిపెట్టి వేలాదిమందికి జీవనోపాధి కల్పించారన్నారు. అనంతరం సైపు సూర్యచంద్రరావు, బడేటి సర్వేశ్వరరావులను సన్మానించారు.


అత్తిలిలో థామస్ ఆల్వా ఎడిసన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వీటి శివశంకర్ ప్రసాద్, రంభ సత్తిపండు, కోసూరి అప్పలస్వామి, గంటా సూర్యనారాయణ, గుండేపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

అతిగా పురుగు మందులు పిచికారీ చేయొద్దు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు అతిగా పురుగు మందులు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన దేవళ్ల సాయి, కిషోర్ వ్యవసాయ క్షేత్రంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు, సల్ఫేడ్ ప్రభావం అధికంగా ఉందన్నారు. ఎరువుల్లో డీజిల్‌ను కలిపి పిచికారీ చేయడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. సిఫార్స్ లేని పద్ధతులను పాటించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, నారాయణ, ఆర్‌బీకే చైర్మన్ నక్కా గంగాధర్, ఉప సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, ఏఈవో మాధవ వర్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆంజనేయులు, పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామంలో రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

తగిన మోతాదులో భాస్వరం ఎరువులు వాడాలి

అత్తిలి: ఎకరాకు 36 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులను మాత్రమే రైతులు వాడాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. అత్తిలి మండలం మంచిలి, కంచుమర్రు గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మోతాదుకు మించి భాస్వరం ఎరువులు వాడితే జింక్ మొక్కలకు అందదని, జింక్‌లోపం వల్ల మొక్క ఎరువులు తీసుకునే లక్షణాన్ని కోల్పోతుందన్నారు. ప్రతి మూడు పంటలకు ఒకసారి జింక్ లోపాన్ని సరిచేసుకోవాలని, దీనికోసం ఎకరాకు 20కిలోల జింక్ సల్ఫేట్ దమ్ములో వేసుకోవాలని లేదా జింక్‌లోపం కనిపించిన చేలల్లో చిలేటెడ్ జింక్ ఎకరానికి 2గ్రాములు, లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. సమపాళ్లలో ఎరువులు వాడకం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

నేడు తాడేపల్లిగూడెంలో ఇస్కాన్ శాఖ ప్రారంభోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) తాడేపల్లిగూడెం శాఖ శ్రవణ కీర్తన నూతన భవనాన్ని ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు ఏరియా ఆసుపత్రి రోడ్డులోని సత్యవతి నగర్‌లో ప్రారంభిస్తున్నట్లు శాఖ నిర్వాహకులు మురళీనాథ్ శ్యామ్ దాస్ వెల్లడించారు. పట్టణంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రారంభోత్సవ సభకు ప్రత్యేక అతిథి ఇస్కాన్ విజయవాడ మందిర అధ్యక్షుడు చక్రధారి దాస్, ఇస్కాన్ తిరుపతి మందిర అధ్యక్షుడు రేవతి రమణ్ ప్రభుజీ, జనరల్ మేనేజర్ బలభద్ర మాధవ దాస్, వివిధ ప్రాంతాల నుంచి ఇస్కాన్‌లు నిర్వాహకులు హాజరవుతారని వెల్లడించారు. ప్రారంభం అనంతరం దర్శన హారతి, భాగవత ప్రవచనం, జగన్నాథ బలదేవ సుభద్రలకు పుష్పాభిషేకాలు జరుగుతాయని, అన్నప్రసాదం వితరణ చేస్తారని వివరించారు. అదే విధంగా ఇస్కాన్‌లో ప్రతిరోజు ఉదయం 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, అదేవిధంగా సాయత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఉదయం సమయంలో మంగళ, శృంగార దర్శన హారతులు, గురుపూజ, భాగవత ప్రవచనం, సాయంత్రం సమయంలో తులసి, సంధ్యా హారతి, భగవద్గీత ప్రవచనం కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కాన్ నిర్వాహకులు మురళీనాథ్ శ్యామ్ దాస్, సభ్యులు

గడపగడపకు మన ప్రభుత్వం ద్వారానే సమస్యల పరిష్కారం

పెంటపాడు: ప్రభుత్వం చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం ద్వారానే పలు సమస్యలు పరిష్కారం అవుతాయని పెంటపాడుకు చెందిన జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నియోజకవర్గంలో చేపట్టిన గడపగడప కార్యక్రమం గురువారం నాటికి నూరురోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పెంటపాడు గేట్ సెంటర్‌లో నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రజల అభిమానం చూరగొంటుందన్నారు. పార్టీ నాయకులు నిరంతరం ప్రజలతో కలిసి ఉండటం వల్ల జనసేన, టీడీపీ నాయకులు తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, గ్రామ సర్పంచ్ సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, పార్టీ నాయకులు ఈశ్వరరావు, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, వార్డు సభ్యులు బర్ల జయరాంబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొలుపూరి శివకిరణ్, వెలగల శ్రీనివాస రెడ్డి, నల్లమిల్లి ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నూరు రోజులు పూర్తైన సందర్భంగా పెంటపాడులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దువ్వలో రాధా వేణుగోపాల స్వామి విగ్రహాల ప్రతిష్ట

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో శ్రీ రాధా సమేత వేణుగోపాల స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం దువ్వ గ్రామంలోని గీతా మందిరం వద్ద నిర్వహించిన ఈకార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ రాధా వేణుగోపాల స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా ఆలయంవద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దువ్వ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్
(భారత ప్రభుత్వ [illegible] – యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)
తాడేపల్లిగూడెం బ్రాంచ్, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా
ఫోన్ నెం.98901 48338, 08818-229279, ఇ-మెయిల్ : bm0238@cggb.co.in

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని రూలు 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 ప్రకారము చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు నందలి రూలు 9తో చదువుకోవలసిన సెక్షన్ 13(2) ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన [illegible]
1) ఋణగ్రహీత : శ్రీ [illegible] శ్రీనివాసరావు, తండ్రి : భాస్కరరావు,
R/o.డి.నెం.86-4/1, శ్రీదేవి నగర్, తాడేపల్లిగూడెం టౌన్, పశ్చిమ గోదావరి జిల్లా, పిన్-534101
2) తనఖాదారు : శ్రీ [illegible] శ్రీనివాసరావు, తండ్రి : భాస్కరరావు,
R/o.డి.నెం.86-4/1, శ్రీదేవి నగర్, తాడేపల్లిగూడెం టౌన్, పశ్చిమ గోదావరి జిల్లా, పిన్-534101
3) సహ-హామీదారు : శ్రీ [illegible], తండ్రి : [illegible], [illegible] పిన్-534101
యొక్క మొత్తము బకాయి తేది.19.11.2022 నాటికి రూ.9,51,055/-(అక్షరాల తొమ్మిది లక్షల యాభై ఒక్క వేల యాభై ఐదు రూపాయలు మాత్రమే) చెల్లించవలసినదిగా ది.19-11-2022న డిమాండు నోటీసు జారీచేసినారు.
[illegible] ది.25-01-2023న దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని తెలియజేయడమైనది.
[illegible] రూ.9,51,055/-(అక్షరాల తొమ్మిది లక్షల యాభై ఒక్క వేల యాభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు తేది.19-11-2022 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, కాస్ట్స్, నిమిత్తం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ వారి ఛార్జికి లోబడి ఉంటాయి.
స్థిరాస్తి వివరములు :
పిన్-534101, ప.గో. జిల్లా, తాడేపల్లిగూడెం టౌన్, వార్డు నెం.17, డి.నెం. 10-24-18 [illegible] ఆర్.ఎస్ నెం.48/3, 49/2 మరియు 49/4 లో 142-0 చ.గజాల [illegible] R/o.డి.నెం. 86-4/1 శ్రీదేవి నగర్ వాస్తవ్యులైన శ్రీ [illegible] శ్రీనివాసరావు, తండ్రి : భాస్కరరావు గారికి చెందినది.
హద్దులు : ఉత్తరం : [illegible] స్థలం-45.0 అం.లు. తూర్పు : [illegible] 28.7 అం.లు, దక్షిణం : [illegible] స్థలం-44.8 అం.లు, పడమర : 20 అం.ల వెడల్పు రోడ్ 28.7 అం.లు.

సం/-అధీకృత అధికారి,
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్,
రీజనల్ ఆఫీసు, ఏలూరు

తేది : 27-01-2023
ప్రదేశం : ఏలూరు

జగనన్న కాలనీల్లో కరెంట్ పనులు

ఇరగవరం: తణుకు నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర భుత్వం యుద్ధ ప్రాతిపాదికన విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది. ఇందు కోసం ఇప్పటి వరకు రూ. 6 కోట్ల 20 లక్షలు ఖర్చు చేసింది. తణుకు, తణుకు రూరల్, ఇరగవరం, గోటేరు, కంతేరు, మండపాక, దువ్వ, తూర్పువిప్పారు, ఒకొక్క కాలనీకి రూ. కోట్లు కేటాయించింది. ఇప్పటికే 1684 విద్యుత్ స్తంభలు పాతారు. ప్రతి ఇంటికి మీటర్ , ప్రతి వీధిలో విద్యుత్‌లైన్, ప్రతి కాలనీకి వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా 70 కాలనీలకు కలిపి సుమారు 18 కిలో మీటర్లు దూరం గల విద్యుత్ లైన్ వేస్తున్నారు. సబ్ స్టేషన్‌ల ఏర్పాటుకు సమాయత్తం అవుతున్నారు. పైడిపర్రు కాలనీల్లో నిరంతరం విత్యుత్ సరాఫరాకు ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి గాను రూ.2 కోట్ల ఇరగవరం, మండపాక, తణుకు శివారు అజ్జరం పుంత, కాలనీల్లో రూ.20 లక్షలతో సపరేటు ఫీడర్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 22 కాలనీల్లో కరెంటు పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన చోట్ల విద్యుత్‌పనులు వివిధదశల్లో ఉన్నాయి.

మంత్రి కారుమూరి కృషి

నియోజకవర్గంలో జగనన్న కాలనీలలో అభివృద్ధిలో రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎంతో కృషి ఉంది. నిరుపేదలు నివసించే కాలనీల్లో ఇప్పటికే రోడ్లు నిర్మించారు. నీటి వసతి కల్పించారు. తాజాగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల పేదలకు ఎంతో మేలు జరుగుతంది. జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సి.హెచ్ రామకృష్ణ , విద్యుత్ ఏడిఇ , తణుకు

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులతో జగనన్న కాలనీలు మోడల్ కాలనీలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ,బోర్డు, ఎంసీబి, ఎర్తింగ్, మీటర్, ర్వీను వైర్ ప్రభుత్వం అందిస్తుంది. గతంలో వీటికి డబ్బులు తీసుకునే వారు ఇప్పుడు జగనన్న హౌసింగ్ స్కీంలో భాగంగా ఉచితంగా అందించడం జరుగుతుంది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాలనీల్లో రోడ్లు, అభివృద్ధి చేసింది. తాగునీటికి పైప్‌లైన్లు వేసింది. రానున్న రోజుల్లో ఈ కాలనీలు మరింత అభివృద్ధి చెందుతాయి.


అయినపర్రు గ్రామంలో వేసిన విద్యుత్ లైన్


అయినపర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com